క్లుప్తంగా

సచివాలయాలకు సంక్షేమ క్యాలెండర్లు



సచివాలయ ఉద్యోగులకు క్యాలెండర్ అందిస్తున్న మండల అధికారి

నల్లజర్ల: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం విడుదల చేసిన 2023–24 సంక్షేమ కార్యక్రమాల అమలు క్యాలెండర్ గురువారం ఉదయం గ్రామ సచివాలయాలకు చేరాయి. ఏయే నెలలో ఏయే పథకం ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరనుందో వివరాలను ఈ సంక్షేమ క్యాలెండర్‌లో పొందుపర్చారు. సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారంతా ఈ క్యాలెండర్‌ను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

శశి క్యాంపస్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్నట్టు శశి విద్యాసంస్థల చైర్మన్ వేణుగోపాలకృష్ణ

దేవరపల్లి: చిన్నాయగూడెంలో శశి క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్టు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. బుధవారం క్యాంపస్ నిర్మాణానికి చైర్మన్ వేణుగోపాలకృష్ణ, రాధారాణి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకూ క్లాసులు ప్రారంభిస్తున్నట్టు ఆయ న తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియో గం చేసుకోవాలని ఆయన కోరారు. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి వేషారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధితుడికి కళాకారుల సాయం



సురేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు

ఉండ్రాజవరం: ఎంబీఏ చదివి ఉద్యోగ ప్రయత్నంలో బెంగళూరు వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కత్తుల సురేష్‌కు ఉభయ గోదావరి జూనియర్, డైలాగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పలువురు కళాకారులు అందజేసిన రూ.24,200 క్రైమ్ బ్రాంచ్ రిటైర్డ్ ఎస్సై వీవీఎస్ రాంబాబు, నిడదవోలు రైల్వే హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మేనేజర్ అన్నదేవర శ్యాంబాబు, బోలిశెట్టి అన్నపూర్ణ, ఘంటసాల గాయకులు చివటం సుబ్బారావు, రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ పులమాల వీరభద్రం, ఐసెట్ వీరలక్ష్మి, కాపాక రామాంజనేయులు తదితరలు పాల్గొన్నారు.

కాశీకి షోకాజ్ నోటీసు జారీ

కొవ్వూరు: ధర్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముళ్లపూడి కాశీ విశ్వనాథ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు జిల్లా పార్టీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇంద్ర వందిత్(రాజా) గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ విశ్వనాథ్ వైఎస్సార్ సీపీలో ఉంటూ పార్టీ పరువు ప్రతిష్టకు భంగం వాటిల్లేలా ప్రకటనలు చేయడమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ, వారంలో వివరణ ఇవ్వాలని కోరినట్టు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

గృహమస్తు..

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం
- 109 లే అవుట్లు, 6109 గృహాల మంజూరు
- వేగంగా జరుగుతున్న జియోట్యాగింగ్
- అన్ని సదుపాయాల కల్పనకు ఏర్పాట్లు

నియోజవర్గంలో మంజూరైన గృహాల వివరాలు ఇలా..

మండలం	లే అవుట్లు	మంజూరైన గృహాలు
దేవరపల్లి	34	2944
గోపాలపురం	37	1149
నల్లజర్ల	38	2016
మొత్తం	109	6109

దేవరపల్లి: పేదల సొంతింటి కల నెరవేరనుంది. ప్రభుత్వం గూడు లేనివారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు కాలనీలను సదర్శించి నీరు, విద్యుత్, రోడ్ల సదుపాయాల ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చి రెండేళ్లయింది. అనంతరం కరోనా కారణంగా గృహ నిర్మాణంలో జాప్యం జరిగింది. మొదటి విడతలో అర్బన్ ప్రాంతంలో ప్రభుత్వం గృహనిర్మాణం చేపట్టింది. గోపాలపురం నియోజకవర్గానికి గృహాలు మంజూరు కాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి లబ్ధిదారుల జాబితా అందజేశారు. రెండో విడతలో గృహాలు మంజూరు చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు రెండో విడత గృహనిర్మాణంలో గోపాలపురం నియోజకవర్గానికి జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణానికి 6109 గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 109 లే అవుట్లలో గృహాల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలను సదర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. కాలనీల్లో నీరు, విద్యుత్, రోడ్లు ఏర్పాటు చేస్తే గృహాలను వేగంగా నిర్మాణం చేసుకుంటామని లబ్ధిదారులు తెలిపారు. కాలనీల్లో బోర్లు వేసి నీరు సరఫరా చేస్తామని, విద్యుత్ సదుపాయం కల్పిస్తామని అధికారులు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఎస్.జగదాంబ దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల పర్యటించి జగనన్న లే అవుట్లను పరిశీలించారు. జియోట్యాగింగ్ వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ నెలలో గృహ నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు.



దేవరపల్లి మండలం బందపురంలో జగనన్న కాలనీలో జియోట్యాగింగ్ చేస్తున్న అధికారులు

దేవరపల్లిలో 30 ఎకరాల్లో జనగనన్న కాలనీ

గుండుగొలను–కొవ్వూరు జాతీయరహదారికి అనుకుని సుమారు 30 ఎకరాలను ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి దాదాపు 2వేల మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేసింది. తొలుత 25 ఎకరాలను సేకరించి సుమారు 1500 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ చేశారు. 90 రోజుల పథకంలో అధికంగా దరఖాస్తులు రావడంతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదేశాల మేరకు అధికారులు మరొక 10 ఎకరాలను సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిలో మరొక 500 మంది లబ్ధిదారులకు స్థలాలు పంపిణీ చేయనున్నారు.

3700 మంది లబ్ధిదారులకు..

నియోజకవర్గంలో సొంత స్థలం ఉండి ఇల్లులేని పేదలను సర్వే చేసి అధికారులు గుర్తించారు. 3700 మంది లబ్ధిదారులను గుర్తించి ఎంజాయ్‌మెంట్ పత్రాలను అందజేశారు. వీరికి గృహాల మంజూరుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ద్వారా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో 3437 గృహాలు మంజూరు కాగా నిర్మాణంలో ఉన్నాయి.



బందపురంలోని జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి జగదాంబ (ఫైల్)


వేగంగా జియోట్యాగింగ్



జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులతో స్థలం జియోట్యాగింగ్ కార్యక్రమం వేగంగా జరుగుతోంది. 80 శాతం పూర్తకా గానే గృహ నిర్మాణాలు ప్రారంభిస్తాం. నియోజకవర్గంలో 109 లేఅవుట్లలో 6109 గృహాలను నిర్మించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో 80 మంది పురుషులు, 6029 మంది మహిళా లబ్ధిదారులు ఉన్నారు. ఎస్సీలు 2293 మంది, ఎస్టీలు 165 మంది, ఓబీసీలు 2365 మంది, జనరల్ కేటగిరి 1286 మంది లబ్ధిదారులు ఉన్నారు. మేలో గృహ నిర్మాణాలు ప్రారంభిస్తాం.

– టి.శేఖర్‌బాబు, డీఈఈ, గృహనిర్మాణ శాఖ

20 వేల మందికి లబ్ధి



ప్రతి పేదోడికి ఇల్లు మంజూరు చేయడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 20 వేల ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో దేవరపల్లి, నల్లజర్ల, ద్వారాతిరుమల, గోపాలపురం మండలాలకు 10 వేల గృహాలు మంజూరయ్యాయి. ఇప్పటికీ లేని వారు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరు చేస్తాం. జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తాన్నాం.

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

పెరవలి: ఈ నెల 8వ తేదీ నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించనున్నట్టు గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రంథాలయాల్లో నిర్వహించే ఈ విజ్ఞాన శిబిరాల్లో కథలు చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, మ్యూజిక్, డ్యాన్సు, వంటి వాటిలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన వివరించారు. తీపర్రు, పెరవలి, ముక్కామల గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు.

నల్లజర్ల: విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెంచి మంచి భవితకు బాటలు వేసేలా ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నల్లజర్ల శాఖాగ్రంథాలయం పాలకురాలు ఎ.వీరమణ తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు శిబిరంలో పాల్గొనవచ్చన్నారు.

నిడదవోలు: పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి కుంచే చినబాబు గురువారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ శిక్షణ ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కొవ్వూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం మెరుగుపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి పేర్కొన్నారు. ఫ్రెండ్స్ క్రికెట్ అకాడమీ పేరుతో పట్టణంలోని అభాస్య స్కూల్ రోడ్డులో ఏర్పాటు చేసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. గురువారం నుంచి జూన్ 12వ తేదీ వరకూ ఈ శిక్షణ శిబిరం కొనసాగు తుందని నిర్వాహకులు డేగల సత్యమూర్తి తెలిపారు. బాల, బాలికలకు వేర్వేరుగా శిక్షణ అందిస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు గండ్రోతు శివరామకృష్ణ, పరిమి హరిచరణ్, గుబతాల సురేష్, శ్యామ్ రవిప్రకాష్ పాల్గొన్నారు.

కమనీయం.. వెంకన్న కల్యాణం

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం ఆలయానికి తీసుకొచ్చి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ జరిగిన ఈ కల్యాణాన్ని భక్తులు తిలకించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చిన్నపిల్లలకు పాలు, దాతల సహకారంతో ఉచిత ప్రసాదం చక్కెర పొంగళి, లడ్డు పంపిణీ చేశారు. అన్నసమారాధనలో ఆరువేల మంది పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

అనంతపల్లిలో...

నల్లజర్ల: అనంతపల్లిలోని రుక్మిణీ, సత్యభామ సమేత మదనగోపాల స్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు ఊరేగింపుగా మండపం వీధిలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిరాల శరణ్య స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేదపండితులు పెదపూడి విజయవెంకట రమణ, ఆలయ అర్చకులు దివిపాండురంగ శర్మ కల్యాణోత్సవం జరిగిపించారు. భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు.



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

శ్రీనివాసుని కల్యాణం

దేవరపల్లి: పల్లంట్లలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం గురువారం సాయంత్రం కమనీయంగా జరిగింది. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను, శ్రీవారిని పెండ్లి కుమారుడిగా అలంకరణ చేసి వివాహ వేదికపై ఉంచి వేదపండితులు వేదమంత్రోచ్చాటన నడుమన కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, కల్యాణ అక్షితలు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

నేరుగా ధాన్యం కొనుగోలుకు చర్యలు

తాళ్లపూడి: వర్షాల కారణంగా ధాన్యం నేరుగా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ టి.రాధిక తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జేసీ ఆదేశాలమేరకు తడిసిన ధాన్యాన్ని, రైతుల వద్ద ధాన్యం ఉంటే ఆఫ్‌లైన్‌లో నమోదు చేసి తక్షణం ఆర్‌బీకే ద్వారా మిల్లులకు తరలిస్తామన్నారు. రైతుల వద్ద ధాన్యం సిద్ధంగా ఉంటే ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేలకు సమాచారం ఇవ్వాలన్నారు. అన్నదేవరపేట–1, 2 ఆర్‌బీకేలకు వెంకటేశ్వర రైస్‌మిల్లు, బల్లిపాడు, గజ్జరంకు సీతారామాంజనేయ రైస్ మిల్లు, మలకపల్లి వెంకటరమణ ట్రేడర్స్, పెద్దేవం–1, 2 లకు శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లు కేటాయించామన్నారు. పోచవరం, ప్రక్కిలంక, తాడిపూడి, తాళ్లపూడి–1, 2 గ్రామాలకు సూర్యా రైస్‌మిల్లు, తిరుగుడుమెట్ట సాయి బాలాజీ రైస్‌మిల్లు, శ్రీలక్ష్మి రైస్‌మిల్లు, వేగేశ్వరపురం ఎస్‌వీవీ సత్యనారాయణ రైస్‌మిల్లు, వేగేశ్వరపురం–2కు శ్రీనివాసా ట్రేడర్స్‌కు కేటాయించామన్నారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు

పెరవలి: వర్షాలు కారణంగా ధాన్యం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేస్తామని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా మిల్లులకు తరలిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో ఆర్బీకేల్లో ఏర్పాట్లు చేశామని, మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో టెక్నికల్ అసిస్టెంట్ నూక శాతం, తేమ శాతం అంచనా వేస్తారని తెలిపారు. ధాన్యం మిల్లులకు తరలించిన తరువాత రైతులు 24 గంటల లోపు ఆన్‌లైన్ చేయించుకోవాలని, అప్పుడే సొమ్ములు వారి అకౌంట్‌లో జమ అవుతాయని వివరించారు.

ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవద్దు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలి
- పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడంలో అర్థం లేదని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరిగిందంటూ ప్రతి పక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని, ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తోందని తెలిపారు. దీనిపై రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతులను దగా చేసి, ఎన్నికల ముందు రైతుల పేరిట పాదయాత్రలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఐక్యంగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. రెండో విడతలో గృహనిర్మాణాలు వేగవంతం చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా రూ.5కోట్లతో తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేపట్టినట్టు తెలిపారు. ఎస్సీ ఏరియాలో జనాభా ప్రాతిపదికన మండలానికి రూ.25లక్షలు చొప్పున నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు రూ.కోటి కేటాయించినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, వైస్ ఎంపీపీ బాలిన వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ ఆర్ శ్రీదేవి, ఏడీఈ కె.రవిశంకర్, సర్పంచ్‌లు యండపల్లి శేఖర్‌బాబు, పఠాన్ అన్సర్‌బాషా, కురుకూరి ధనలక్ష్మి, పైడి శిరీష, ఎంపీటీసీలు వార సంగీత, యడ్లపల్లి సూరిబాబు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు వెంకట్రావు



ప్రధాన కార్యదర్శి జయరాజు



క్లబ్ కోశాధికారి రామకృష్ణ

కొవ్వూరు: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా దొమ్మేరుకి చెందిన కలగర వెంకట్రావు, కార్యదర్శిగా పట్టణానికి చెందిన పెనుమాక జయరాజు, కోశాధికారిగా ఉప్పులూరి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా నామన బుల్లిరాజులను నియమించారు. మొదటి ఉపాధ్యక్షుడిగా పిల్లలమర్రి మురళీకృష్ణ, రెండో ఉపాధ్యక్షుడి గా మద్దిపాటి వీర వెంకటసత్యనారాయణ, మూడో ఉపాధ్యక్షుడిగా ఎండీ హుస్సేన్, మెంబర్‌షిప్ చైర్‌పర్సన్‌గా గుడపాటి వెంకట సత్యశివప్రసాద్, ఎల్‌సీఐఎఫ్ చైర్ పర్సన్‌గా ఎంజేఎఫ్ యనమదల వెంకట సుబ్రహ్మణ్యం, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా పాలెంపాటి చినబాబు చౌదరి, సర్వీసు చైర్ పర్సన్‌గా బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ కమ్యూనికేషన్ చైర్ పర్సన్‌గా పాలగుడుల లక్ష్మణరావులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంఠమణి రామకిషోర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు పూర్వ అధ్యక్షులంతా కొనసాగుతారని నూతన అధ్యక్షుడు వెంకట్రావు తెలిపారు.

ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

తాళ్లపూడి: గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకూ జరగనున్నాయి.

అమ్మవారికి పూజలు

చాగల్లు: ఊనగట్ల గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి పురిపాక వద్ద నడివీధిలో గురువారం కుంకుమ పూజలు చేశారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈనెల 14వ తేదీన అమ్మవారి సేవలో భాగంగా గామోత్సవం జరుగుతుందని, 21 వరకూ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నల్లజర్ల: తెలికిచెర్ల గ్రామ దేవత అంకాలమ్మ అమ్మవారి గంప జాతర మహోత్సవం వైభవంగా జరుగుతోంది. ఈ జాతర గత నెల 25వ తేదీ నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జరగనుంది. జాతర సందర్భంగా అమ్మవారిని పూరి గుడిశే నుంచి మేళతాళలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి పుట్టింటి వారైన సుంకర వారి ఇంటి వద్ద, అత్తింటి వారైన కోట వారి ఇళ్ల అమ్మవారికి పొన్పుల కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఊనగట్లలో పూజలు అందుకుంటున్న అమ్మవార్లు

నానుతున్న ఇటుక బట్టీలు

నల్లజర్ల: అకాల వర్షాలకు అనంతపల్లిలోని ఇటుకల బట్టీలన్నీ వర్షపు నీటిలో నానుతున్నాయి. ఇక్కడ దాదాపు 50కిపైగా బట్టీలున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు ఇక్కడ పనిచేస్తూ ఉంటారు. ఒక్కో బట్టీలో 50 వేలకు పైగా ఇటుక తడిసిపోయి పాడైపోయాయి. కాల్చిన బట్టీలు కూడా తడిసిపోవడంతో నష్టపోయామని యజమానులు వాపోయారు.

అయోమయంలో అన్నదాత

- వర్షానికి తడిసి మొలకలొచ్చిన ధాన్యం
- ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

చాగల్లు: బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రైతుల పరిస్థితి ఆయోమయంగా మారింది. మండలంలో గురువారం బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, కలవలపల్లి, ఊనగట్ల, నందిగంపాడు, దారవరం తదితర గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి. గురువారం వాతావరణం కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు అనుకూలించడంతో రోడ్లపై, కళ్లాలో బరకాలతో కప్పిన ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. ఎస్.ముప్పవరం, ఊనగట్ల, కలవలపల్లి గ్రామాల్లో కొంతమంది రైతుల ధాన్యం మొలక రావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అకాల వర్షం తమను కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని రైతులు అంటున్నారు.

అండగా అధికార యాంత్రాంగం

ప్రభుత్వ ఆదేశాలతో మండల, గ్రామ, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు రైతులకు అండగా నిలుస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కె.వేణుగోపాల్, ఎంపీడీవో బి.రాంప్రసాద్ గ్రామాల్లో పర్యటించారు. రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇంతవరకు 3593.8 క్వింటాళ్లు ఆఫ్‌లైన్‌లో సేకరించినట్టు వారు తెలిపారు.

72 హెక్టార్లలో పంట నష్టం

పెరవలి: మండలంలో గత వారం రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో పల్లపు ప్రాంతాలను జలయమం చేయగా వరిచేలు నేలనంటాయి. కళ్లాల్లో ధాన్యం రాశులు తడిచి ముద్దవ్వడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో దాళ్వా సాగు 35,500 ఎకరాల్లో సాగు చేయగా ఇప్పటికి 40 శాతం కోతలు జరిగాయి. పెరవలి మండలంలో 8500 ఎకరాల్లో సాగు చేపట్టగా కానూరు, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో మూసూళ్లు ముమ్మరంగా జరుగుతుండగా వర్షం వచ్చి నష్టం కలిగించింది. వారం రోజులు కురిసిన వర్షాలకు 1400 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిచిపోయిందని, 72 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అధికారులు పంట నష్టం అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు.



అజ్జరంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



కలవలపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో వేణుగోపాల్

రైతులను ఆదుకోవాలి

నిడదవోలు: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ పట్టణ బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నీలం రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదావరికి మహానీరాజనం

కొవ్వూరు: శోభ కృత నామ సంవత్సరం వైశాఖ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం గోష్పాదక్షేత్రంలో గోదావరి మహానీరాజనం సమర్పించనున్నట్టు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగోట్ల కృష్ణారావు తెలిపారు. 211వ మాసోత్సవంలో భాగంగా సాయంత్రం ఆరు గంటలకు అఖండ గోదావరి నదీకి మహానీరాజనం సమర్పిస్తామన్నారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు



సింగవరంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, తహసీల్దార్ ఎం.గంగరాజు

నిడదవోలు రూరల్: ఆకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. మండలంలోని సింగవరం, తీరుగూడెం, పురుషోత్తపల్లి గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు, కౌన్సిలర్ వజీరుద్దీన్, తహసీల్దార్ ఎం.గంగరాజులు గురువారం పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు జిల్లా కలెక్టర్ మాధవీలత, పౌరసరఫరాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తడిసిన ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. తహసీల్దార్ ఎం.గంగరాజు మాట్లాడుతూ మండలంలో 10.50 లక్షల గోనెసంచులు అవసరం కాగా ఇప్పటికే సుమారు 9 లక్షల గోనెసంచులు రైతులకు అందజేశామన్నారు. గోనెసంచుల కొరత లేకుండా బిక్కవోలు మండలంలోని రైస్‌మిల్లర్ల నుంచి తీసుకువస్తున్నామని చెప్పారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నామన్నారు.